క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో జన్మ నక్షత్ర వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నల్లజర్ల: అనంతపల్లిలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర వేడుకలు నిర్వహించారు. అర్చకులు దివి సాందురంగ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్తి ఉదయశంకర శ్రీనుబాబు దంపతుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. పోతవరం అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపాలస్వామి ఆలయంలో శ్రీపుష్ప యాగోత్సవం

ఉండ్రాజవరం: తాడిపర్రులో రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాల స్వామి వార్లకు సోమవారం రాత్రి శ్రీపుష్పయాగోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ముందుగా స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం మహిళలతో శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కోడూరి హనుమంత రావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా 'కామ దహనం'



చివటంలో కలప, చెక్క వస్తువులను మంటలో వేసి దహనం చేస్తున్న గ్రామస్తులు

ఉండ్రాజవరం: చివటం గ్రామంలో ఆదివారం రాత్రి సంప్రదాయబద్ధంగా కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమకు అక్కరకు రాని కలప, చెక్క వస్తువులను మంటలో వేసి దహనం చేసారు. సుమారు వందేళ్లకు పైగా ఈ సంప్రదాయం గ్రామంలో కొనసాగుతోంది. గ్రామస్తులు చెబుతున్న వివరాల ప్రకారం వేసవికాలంలో తరచూ గ్రామంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునేవని, వీటిని అరికట్టడానికి అగ్నికి మొక్కుబడిగా కామ దహనం నిర్వహించేందుకు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. నాటి నుంచి హోలి పౌర్ణమి రోజున గ్రామస్తులంతా గ్రామ ప్రధాన కూడలిలో తొలుత రావిచెట్టు కొమ్మను పాతి పెట్టి, ఆ కొమ్మ చుట్టూ దేవుని ఊరేగించిన అనంతరం వస్తువులను గుట్టగా వేసి మంట వేస్తామని తెలిపారు. ఈ కామ దహనం మొదలు పెట్టినప్పుడు నుంచి గ్రామంలో అగ్ని ప్రమాదాలు ఆగిపోయినట్లు స్థానికులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

నిడదవోలు రూరల్: కంసాలిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను సోమవారం అరెస్ట్ చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి గౌతమి వద్ద 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

నరసింహమూర్తి మృతి సీపీఐకి తీరని లోటు



నరసింహమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, నాయకులు

పెరవలి: సీపీఐ నాయకులు బోగవల్లి నరసింహమూర్తి మృతి సీపీఐకి తీరనిలోటని పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యుడు కోనాల భీమారావు పేర్కొన్నారు. పెరవలి మండలం తీపర్రులో ఆయన స్వగృహంలో సోమవారం ఉదయం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెనుగొండ నియోజకవర్గంలో సీపీఐ పార్టీ మూడు సార్లు విజయకేతనం ఎగురవేసిందంటే అందుకు ఈయన ముఖ్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈయన కుమారులు బోగవల్లి వెంకటేశ్వరరావు, చంటిబాబు, సీపీఐ నాయకులు పంతం నాగేశ్వరరావు, నామన వెంకటేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ, రంగిసీడి ఆదినారాయణ, సైపురెడ్డి బాజ్జి, గుత్తుల మహాలక్ష్మి, కంఠమని వెంకటేశ్వరరావు, మద్దిపాటి జానికిరామయ్య, కరుటూరి రామకృష్ణ, వెలగల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు జగనన్న చేదోడు

- నియోజకవర్గంలో 5,187 మందికి లబ్ధి
- వైఎస్సార్ సీపీ పాలనలో రూ.20.74 కోట్ల ఆర్థిక సాయం
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న చేతి వృత్తుల కుటుంబాలు



కానూరులో చేదోడు పథకం లబ్ధిదారులు



కానూరులో మహిళా దర్జీలకు చేదోడు పథకం మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు (ఫైల్)

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న చేదోడు పథకం చేతి వృత్తుల వారి పాలిట కల్పతరువుగా మారింది. చేతి వృత్తులను నమ్ముకుని కాలం జీవిస్తున్న పేదలకు ఈ పథకం అండగా ఉండటంతో పాటు ఆర్థిక పరిపుష్టినందిస్తోంది. కాలంతో పాటు చేతి వృత్తులు కనుమరుగైపోతున్న దశలో చేదోడు పథకం చేతి వృత్తిదారులకు అండగా ఉంటోంది. ఇంతకాలం కుల వృత్తులను నమ్ముకుని అరకొర ఆదాయంతో జీవితాలు గడిపామని ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టడంతో పాటు ఆర్థిక సాయం అందించటంతో మా కుటుంబాలు నిలదొక్కుకుంటున్నాయని లబ్ధిదారులు అంటున్నారు. ఈ పథకంలో కుమ్మరి, నాయీ బ్రాహ్మణులు, దర్జీలు, రజక వృత్తి వంటి వారికి లబ్ధి చేకూరుతుంది.

నియోజకవర్గంలో ఎంత మందికి లబ్ధి

నిడదవోలు నియోజకవర్గంలో వివిధ రకాల చేతి వృత్తులు చేసుకుంటున్న వారు వేలల్లో ఉన్నా, కాలంతో పాటు వచ్చిన మార్పుల కారణంగా చేతి వృత్తులను వదలివేసి చాలామంది వేరే రంగం వైపు వెళ్లిపోయారు. నియోజకవర్గంలో 5,187 మందికి ఏటా రూ.10 వేలు చొప్పున ప్రతి లబ్ధిదారుడుకి ఆర్థిక భరోసా కలగడంతో చేతి వృత్తులపై ఆధారపడిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు మండలంలో 1,870 మందికి, పెరవలి మండలంలో 1,733 మందికి, ఉండ్రాజవరం మండలంలో 1,584 మందికి ఏటా లబ్ధి చేకూరుతోంది. ఈ పథకంలో ప్రతి లబ్ధిదారుడుకి రూ.10 వేలు చొప్పున నాలుగేళ్లుగా రూ.40 వేలు లబ్ధి అందగా ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.20.74 కోట్లు లబ్ధి చేకూరింది.

మా జీవితాల్లో వెలుగులు



జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా జీవితాల్లోకి వెలుగులు వచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి బార్బర్ షాపు యజమానులకు రూ.10 వేలు ఇస్తూ మా కడుపులు నింపారు. ఆయన రుణం తీర్చుకోలేనిది. ఇప్పటికే ఈ వృతి కొనసాగించలేక వివిధ పనులకు కొందరు వెళ్లిపోతున్నారు. చేదోడు పథకంతో చేతి వృత్తిదారులకు పూర్వపు వెలుగు వస్తుంది.

– కవిత శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణుడు, కానూరు

పేదల ఆకలి తీర్చిన నాయకుడు జగన్



చేతి వృత్తులకు విలువ తగ్గిపోవడంతో మా సంక్షేమాన్ని పట్టించుకున్న నాయకుడు లేరని బాధపడే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మమ్మల్ని గుర్తించి, పేదల కడుపు నింపటానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏటా ఆర్థిక సాయం అందించటంతో సమాజంలో గౌరవంగా జీవిస్తున్నాం.

– తుమ్మలపల్లి మాధవరావు, కానూరు అగ్రహారం

వేలాది మందికి ఉపయోగం



కాలంతో పాటు చేతి వృత్తులు కనుమరుగవుతున్న పరిస్థితుల్లో వాటిపై ఆధారపడిన వారికి జగనన్న చేదోడు పథకం ఎంతో చేయూత నిచ్చింది. దీనితో చేతి వృత్తులపై గౌరవం ఏర్పడి ఇప్పుడు గాడిన పడుతున్నాయి. ఈ పథకం వల్ల వేలాది మందికి చేతి నిండా పని ఉంటోంది.

– టి.అప్పారావు, నడుపల్లి

ఎన్నికల హామీ మేరకు పథకం అమలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో చేతి వృత్తులపై ఆధారపడిన కులాలకు హామీ ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 7 నెలల్లో చేదోడు పథకం ప్రవేశపెట్టి అమలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి చేతి వృత్తులపై ఎంతో గౌరవం ఉంది, దీనికి చేదోడు పథకమే ఒక నిదర్శనం. ఇటువంటి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నాను.

– జి. శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

చిత్తశుద్ధితో కృషి చేసిన వారికి సముచిత స్థానం

- సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరికలు
- పెద్దేవంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు



పెద్దేవంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు



కొవ్వూరు ఇందిరమ్మ కాలనీ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి చిత్త శుద్ధితో కృషి చేసిన వారికి భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని కొవ్వూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు అన్నారు. మండలంలోని పెద్దేవంలో సోమవారం మండల కన్వనర్ కాకర్ల వెంకటేశ్వరరావు అధ్యతన ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు సమక్షంలో పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్రహ్మణ్యం, సాయన సుబ్బారావుతో పాటు సుమారు 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పార్టీలోకి చేరడంతో వారికి తలారి వెంకటరావు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తలారి వెంకటరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన అన్ని ప్రాంతాల్లోని వారు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని అన్నారు. కల్లూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ విజయానికి సైనికుల్లా కృషి చేస్తామని అన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కొమ్మరెడ్డి పరశురామారావు, ఏఎంసీ వైఎస్ చైర్మన్ కొలశెట్టి నాగేశ్వరరావు, నాయకులు నరాలశెట్టి వీరవెంకటరావు, పిట్టా శ్రీనివాస్, సిర్రా గంగారావు, కంఠమని రమేష్, ముళ్లపూడి కాశీ, ఉప్పులూరి సూరిబాబు, రావిపాటి లక్ష్మణరావు, యండపల్లి కృష్ణార్జునుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకూ మేలు

కొవ్వూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు కోరారు. పట్టణంలో 15,14 వార్డుల్లో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వార్డు కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, చీరా అరుణకుమారి, కౌన్సిలర్ కంఠ మణి రమేష్‌బాబు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు, చౌప్పా అప్పల నాయుడు, చిట్టూరి అన్నవరం, గుర్రే శరత్, ఎండీ ఆలీ, బోడసింగి తులసీ, మెరిపో వీర్రా జు, పాకా మోహన్‌రావు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



నిడదవోలులో సుబ్బరాజుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైస్ చైర్మన్ వెంకటలక్ష్మి, పార్టీ శ్రేణులు

నిడదవోలు: పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో పేదల పాలిట పెన్నిధి సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన అందరూ నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర అన్నారు. పట్టణంలో సుబ్బరాజుపేటలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జి.శ్రీనివాసనాయుడు, గూడూరి శ్రీనివాస్ విజయానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ముంగండి కృపానందం, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే ఛాన్‌భాషా, కౌన్సిలర్లు పిట్టా పద్మావతి, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు గంగుల గోపియాదవ్, తోలేటి కోటేశ్వరరావు, గుర్రం జేమ్స్, ఆలమూరి రాజ, బుంగా ప్రసాద్, కైకరపు సత్యనారాయణ, పోతురాజు, శ్రీనివాస్, కేసనపు పద్మ, తాంబే రామలక్ష్మీ, ముప్పిడి చిట్టికుమారి, విజయ, సత్తెమ్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



అజ్జరంలో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: రాష్ట్రంలో పేదల జీవితాల్లో మరింత వెలుగులు రావాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం అజ్జరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సర్పంచ్ గార్లపాటి సుధా భూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం తొలగేందుకు, అర్హులందరికీ మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మీ ముందుకు వచ్చామని అలాగే గడప గడపకు మన కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 280 ఇళ్లను సందర్శించి లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ నాయకులు, భాస్కర రెడ్డి, సురేష్ రెడ్డి, వాసురెడ్డి, నాగిరెడ్డి, దొడ్డిగర్ల స్వాతి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



యర్నగూడెంలో శ్రీవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలో నూతనంగా నిర్మించిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 8.21 గంటలకు ఉత్తర నక్షత్రయుక్త మేష లగ్న పుష్కరాంశంలో స్వామి వారి, అమ్మవార్ల విగ్రహ ప్రతాష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితుల చేతుల మీదుగా వేద పండితుల వేద మంత్రాలతో స్వామి వారి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి కుడివైపున నిర్మించిన కోదండ రామాలయంలో సీతా రామ లక్ష్మణస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ప్రధాన దాత దేవరపల్లికి చెందిన పారిశ్రామిక వేత్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం, రోహిణీ దంపతులు ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. కలశాలతో గ్రామస్తులు, భక్తులు ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి కుంభాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో రెండు ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారిని, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. దాతలు ఆలయానికి భారీగా విరాళాలు అందజేశారు.

క్షణక్షణం.. క్షుణ్ణంగా తనిఖీ

వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద ఎలక్షన్ చెక్‌పోస్ట్



వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద ఎలక్షన్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నల్లజర్ల: ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. చాలా ప్రాంతాల్లో అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నల్లజర్ల మండలం వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈచెక్ పోస్టు వద్ద 24 గంటల నిఘా ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియమావళి అమల్లోకి రావడంతో నగదు రవాణాపై అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బృందాలుగా ఏర్పడి రహదారులపై వాహన తనిఖీలు చేస్తున్నారు. తగిన ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదు, బంగారం, వెండి వస్తువులు, చీరలు ఇతర సామగ్రిని తరలిస్తే జప్తు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రూ.50వేలకు మించి నగదు, రూ.10వేలకు మించి విలువ గల సామగ్రి రవాణా చేయడం నిషిద్ధమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



అన్నదేవరపేటలో ప్రచారం నిర్వహిస్తున్న తలారి వెంకటరావు కుటుంబ సభ్యులు

తాళ్లపూడి: అందరికీ మేలు చేసిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని షాలిని అన్నారు. అన్నదేవరపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకటరావు కుమార్తె షాలిని, అక్క పొట్టి స్వర్ణలత, చెల్లెలు చిన్నం సుజాత తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు ప్రజలకు అందించి తన తండ్రిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ ఎలిపే సుధారాణి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పిట్టా శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఎం దమయంతి, నాయకులు మెట్టే చిన్ని, సోమరాజు, నూతంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం

కొవ్వూరు: పట్టణంలో 17వ వార్డులో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

ధవళేశ్వరం: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి ధవళేశ్వరంలో అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనకు సంబంధించి ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధవళేశ్వరానికి చెందిన ఏలూరి సత్యనారాయణ వరప్రసాద్ తెలంగాణ నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అతని వద్ద నుంచి పది బాటిల్స్ మద్యం సీసాలను, రూ.900 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటంతోనే జీతాల పెంపు

రాజమహేంద్రవరం సిటీ: రెండేళ్ల నిరంతరాయ పోరాటం చేయడం ద్వారా 17 శాతం జీతాలు పెంపు సాధించుకున్నామని ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోషియేషన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ కిషోర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సూర్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం హోటల్ రివర్‌బే ఆహ్వనం పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 5 జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఆఫీషర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ ఆఫీసర్ల జీతాల పెంపు కోసం 2022 నవంబర్ నుంచి ప్రారంభించిన పోరాటంతో సాధించుకున్నామని, 9 జాయింట్ నోట్ సెటిల్‌మెంట్ కావడంతో 17 శాతం పెంపు సాధించుకున్నామన్నారు. పెరిగిన జీతాలు 2024 మార్చి 25న ఆఫీషర్ల ఖాతాల్లో జమ కావడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఐదు రోజుల పనిదినాలు అమలులోనికి రానున్నాయన్నారు. దీని కోసం సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ సమాఖ్య జనరల్ సెక్రటరీ రూపమ్ రాయ్ వర్చువల్‌గా పాల్గొని నిరంతరం ఆఫీసర్స్ యోగక్షేమాల కోసం కృషి చేస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో 5 జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు 450 మంది ఆఫీసర్స్ పాల్గొన్నరన్నారు

వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం



కొవ్వూరులో వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల్లో పదవులు పొందిన నాయకులను సత్కరించిన దృశ్యం

కొవ్వూరు: ఇటీవల నూతనంగా ప్రకటించిన వైఎస్సార్ సీపీ కమిటీల్లో వివిధ పదవులు పొందిన పార్టీ నాయకులను సోమవారం పార్టీ నాయకులు చొప్ప అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రెండోసారి పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గంధం శేషసాయి, పట్టణ కార్యదర్శిగా నియమితులైన సూర్ల నగేష్, ఎస్సీ సెల్ పట్టణ శాఖ అధ్యక్షుడు గుర్రే శరత్, చాగల్లు మండల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చీలి ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ ఆలీ, జిల్లా వికలాంగ సంఘం జాయింట్ సెక్రటరీ జోష్‌బాబుతో పాటు కౌన్సిలర్ చీరా అరుణ, సాంస్కృతిక విభాగం కార్యదర్శి తేతలి రవికుమార్‌ను శాలువా కప్పి, పుష్పమాలతో సత్కరించారు. కొడమంచిలి విజయ్‌కుమార్, చీర వెంకటరమణ, చిట్టూరి అన్నవరం పాల్గొన్నారు.